క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోవాలి

మరిపెడ రూరల్ : కొత్తగా భూమి పట్టా పాసు పుస్తకం పొందిన రైతులు 'రైతు బంధు' పథకం కింద 2023 యాసంగి సాగు పెట్టుబడి పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని మండల ఏఓ వీరసింగ్ కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రైతు బంధు దరఖాస్తు పత్రంతో పాటు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలు జత చేసి రెండు సెట్ల దరఖాస్తు ఫారాలను వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

'ముసుగు' తొలగించారు



గార్ల : 'కోడ్ ముగిసిన తొలగించని ముసుగులు' అనే శీర్షికన మంగళవారం సాక్షి దిన పత్రికలో ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. గార్లలో ఎన్నికల ముందు జాతీయ, రాష్ట్ర నాయకుల విగ్రహాలపై వేసిన ముసుగులను ఎట్టకేలకు గ్రామ పంచాయతీ సిబ్బందిచే స్థానిక అధికారులు తొలగించారు.

సాక్షి ఎఫెక్ట్..

బస్సు సర్వీసులు పెంచాలి



నెహ్రూసెంటర్ : గూడూరు మండలంలోని అప్పరాజుపల్లి గ్రామానికి ఉన్న ఆర్టీసీ బస్సు సర్వీసులను పెంచి నడిపించాలని స్థానిక ఎంపీటీసీ గీతాఅమరేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డిపో కార్యాలయంలో అధికారికి మంగళవారం వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ.. గ్రామానికి కేవలం రెండు ట్రిప్పులు మాత్రమే బస్సు రావడంతో ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పిండ్రాల రాందాస్, భరత్, పిట్టల వెంకన్న, ఆంజనేయులు, గాంధీ వీరన్న, హేమంత్, ఉమాకర్, మణికంఠ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో అన్నదానం

బయ్యారం : కార్తీకమాసం ముగింపు సందర్భంగా మండల కేంద్రంలోని శివాలయంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అన్నదాత తిరుమల సంజీవరెడ్డి, ఆలయ నిర్వాహకులు వెంకన్న, సారయ్య, రవి, ఉపేందర్, భిక్షం పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు..



కేసముద్రం : మండల కేంద్రంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్ రెడ్డి, లక్ష్మి దంపతులు తమ కుమారుడు శ్రీనేష్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మంగళవారం అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. గురుస్వామి పోలెపల్లి యాకుబ్‌రెడ్డి, కూరెల్లి సతీష్, ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.

అన్నదానంతో స్వామివారి అనుగ్రహం



మహబూబాబాద్ రూరల్ : అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేయడం అదృష్టంగా భావించాలని డీఎస్పీ తీర్థాల సత్యనారాయణ అన్నారు. మంగళవారం అయ్యప్ప స్వామి దేవాలయంలో మాలధారులకు అన్నదానం భిక్షకు వరంగల్ జిల్లా గీసుకొండ మండలం అనంతారం సర్పంచ్ జిల్లెలమూడి అశ్విని, మురళీమోహన్, గుడే నాగవరప్రసాద్ మంగళవారం సహకారం అందించారు. ఈ కార్యక్రమానికి డీఎస్పీ సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

నెహ్రూసెంటర్ : తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఉపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, బిల్లకంటి సూర్యం అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ.. లక్షలాది మంది నిరుద్యోగులు ఉపాధి పొందుతూ, కుటుంబ పోషణ కోసం ఆటో నడుపుతూ జీవిస్తున్నారని పేర్కొన్నారు. ఉచిత బస్సులతో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మనెంట్ చేయాలని ఆయన కోరారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి ఆటో డ్రైవర్లకు భరోసా కల్పించాలన్నారు.

కష్ట సుఖాల్లో అండగా ఉంటా..

- మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్ : తనపై నమ్మకంతో ఎమ్మెల్యేగా గెలిపించిన మహబూబాబాద్ నియోజవర్గ ప్రజల కష్టసుఖాల్లో అండగా ఉంటానని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ అన్నారు. మానుకోట పట్టణంలో పాత బజారులోని హనుమాన్ ఆలయంలో మంగళవారం కార్తీకమాస యజ్ఞ పూజలు ముగిశాయి. ఈ సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త ఓం నారాయణ లోయ ఆధ్వర్యంలో జరిగిన ముగింపు పూజలకు ఎమ్మెల్యే మురళీనాయక్, ఉమా దంపతులు పాల్గొన్నారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వికాస తరంగిణీ ఆధ్వర్యంలో ప్రతి అమావాస్య రోజు అన్నదానం నిర్వహించే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. హనుమాన్ ఆలయ అభివృద్ధి, పునర్ నిర్మాణానికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మదన్ గోపాల్ లోయ, సరళ, మున్సిపల్ వార్డు కౌన్సిలర్ గోగుల అనురాధరాజు, రాజేష్, సంతోష్, సూర్య ప్రకాష్, వెంకటేశ్వర్లు, వొబ్బిలిశెట్టి రామకృష్ణ, పరకాల రవీందర్ రవీందర్, వీరన్న, గర్రెపల్లి శశాంక్, ప్రియాంక, శిరీష, అనిత, సత్యవతి, వాణి, శ్వేత, పాపిరెడ్డి, జంగాల కిరణ్, ప్రవీణ్, తల్లాడ రామారావు, ఈగ శ్రీనివాస్, రమేష్, మాలే వేణుమాధవ్, శ్రీరంగం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్‌కు అభినందనలు తెలుపుతున్న సీపీఐ నాయకులు తదితరులు

సీపీఐ, ఏఐటీయూసీ నాయకుల అభినందన

నెహ్రూసెంటర్/మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్‌ను సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్ సారథిరెడ్డి మంగళవారం రాత్రి పూల బొకే అందజేసి అభినందనలు తెలిపారు.

మురళీని కలిసిన ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు

మహబూబాబాద్ అర్బన్ : మానుకోట జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్‌ను ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. నాయకులు పార్నంది రామయ్య, చాగంటి ప్రభాకర్, మందుల శ్రీరాములు, లచ్చిరాం, కిషన్ నాయక్, రవి నాయక్, దేవ్ సింగ్, వీరస్వామి, లాల్, శంకర్ పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

కార్మికులకు అండగా నిలుస్తా

- డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రు నాయక్

మరిపెడ : కార్మికుల హక్కుల రక్షణకు అండగా నిలుస్తానని డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రు నాయక్ అన్నారు. మండల కేంద్రంలో సీపీఐ, సీఐటీయూ నాయకులు ఎమ్మెల్యేను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్ సప్లై సిటీ హమాలీల హక్కుల రక్షణకు పాటు పడుతానన్నారు. బడుగు బలహీన వర్గాలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అన్ని వర్గాలకు అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, మారగాని బాలకృష్ణ, అబ్దుల్ రషీద్, పోలేపాక వెంకన్న, నారాయణ, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టాలి: రాంచంద్రు నాయక్

మరిపెడ రూరల్ : రైతులు సాగునీటి కోసం నిర్మించిన ఆనకట్ట మరమ్మతులు వెంటనే చేపట్టాలని డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రు నాయక్ ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. మరిపెడ మండలం తానంచర్ల రెవెన్యూ పరిధిలోని పాలేరు వాగుపై గతంలో నిర్మించిన ఆనకట్ట ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెగిపోయింది. ఈ మేరకు ఆనకట్టను ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలేరు వాగుపై నిర్మించిన ఆకనట్ట రైతులకు ఉపయోగపడుతుందన్నారు. వెంటనే అధికారులు తెగిపోయిన ఆనకట్టకు మరమ్మతులు చేపట్టాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీర్‌రెడ్డి, అజ్మీరా శ్రీనివాస్, ఇరిగేషన్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్

మంత్రి సీతక్కకు సన్మానం



సీతక్కను సత్కరిస్తున్న వెన్నం శ్రీకాంత్ రెడ్డి

మహబూబాబాద్ రూరల్ : తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపి శాలువాతో సన్మానించారు.

పరామర్శ

పెద్దవంగర : మండలంలోని చిన్నవంగర గ్రామానికి చెందిన అనపురం మంజునాథ్(23) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పాలకుర్తి నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి మంగళవారం మంజునాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేసి, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. టీపీసీసీ మాజీ సభ్యుడు కేతిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, నాయకులు తోటకూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు

విరిగిన విద్యుత్ స్తంభాలు

కేసముద్రం : ఓవర్ లోడ్‌తో వెళ్తున్న ధాన్యం లారీ ప్రమాదవశాత్తు తీగలను తాకడంతో విద్యుత్ స్తంభాలు విరిగిన సంఘటన మండలంలోని వెంకటగిరి గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటగిరి సమీపంలోని ఓ రైస్ మిల్లు నుంచి ధాన్యం లోడ్‌తో కేసముద్రం వైపునకు ఓ లారీ బయలుదేరింది. మార్గమధ్యలో విద్యుత్ తీగలకు బస్తాలు తాకగా, అప్పటికే రైతులు గమనించి కేకలు వేశారు. డ్రైవర్ గమనించకపోగా లారీ ముందుకు వెళ్లడంతో తీగలు తెగడంతో పాటు, రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. స్థానికులు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

సంక్షిప్త సమాచారం

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి



గూడూరు : మండలంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్తమశ్రేణిలో పాసయ్యే విధంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని మండల నోడల్ ఆఫీసర్ చీర భిక్షపతి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని హైస్కూల్‌లో మంగళవారం సాంఘిక శాస్త్ర పాఠశాల సముదాయ సమావేశంలో గూడూరు, కొత్తగూడ, గంగారం మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వారికి విద్యాబోధనపై పలు రకాల సూచనలు చేశారు. ఆర్‌పీ మహబూబ్‌అలీ, ఉపాధ్యాయులు వీరస్వామి, రాంబాబు, కోటి, చైతన్య, సులోచన, ఉమాదేవి, వసంత, మమత, సుహాసిని, యాకమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



కురవి : సీరోలు మండలం కాంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి డ్రాయింగ్, పెయింటింగ్ పోటీల్లో అవార్డులు పొందారు. ఈమేరకు పాఠశాలలో మంగళవారం విద్యార్థులను అభినందించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు వేసిన పెయింటింగ్స్, డ్రాయింగ్‌లు ముంబాయ్‌లోని రంగోత్సవ్ కార్యక్రమానికి పంపించారు. మంగళవారం రంగోత్సవ్ ఫలితాలను వెల్లడించగా పాఠశాలకు చెందిన 25 మంది విద్యార్థులు అవార్డులు సాధించి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించినట్లు హెచ్‌ఎం అరుణశ్రీ తెలిపారు. నేషనల్ ఐకాన్ అవార్డు పాఠశాల హెచ్‌ఎం అరుణశ్రీకి, డ్రాయింగ్ మాస్టర్ ఎం.బాలరాజుకు కళాభూషణ్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోట శోభారాణిరమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్‌లో బంగారు పతకం

మహబూబాబాద్ అర్బన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో ఇటీవల జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలో మానుకోట అనంతారం మోడల్ స్కూల్ ఇంటర్ విద్యార్థి బదావత్ ప్రత్యుష బంగారం పతకం సాధించి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం అమరావతి, పీడీ సింధువర్మ తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆస్పత్రి భవనం ఎక్కి వ్యక్తి హల్‌చల్

నెహ్రూసెంటర్ : మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి భవనంపై ఓ వ్యక్తి ఎక్కి హల్‌చల్ చేసిన సంఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ప్రసవం కోసం తన భార్యను ఆస్పత్రికి తీసుకురాగా సిబ్బంది తమ నుంచి డబ్బులు వసూలు చేశారని ఆరోపిస్తూ సదరు వ్యక్తి ఆస్పత్రి భవనం ఎక్కాడు. ఆస్పత్రి సిబ్బంది అతనిని వెంటనే కిందకు దింపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

చిన్నగూడూరు : మండలంలోని మన్నెగూడెం గ్రామానికి చెందిన మెట్టు విజయకు మంజూరైన రూ.22 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు బాధిత కుటుంబానికి మంగళవారం అందజేశారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



గార్ల: సమ్మె చేస్తున్న తపాలా ఉద్యోగులు



కేసముద్రం: సబ్ పోస్టాఫీస్ ఎదుట..

గార్ల : తమను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ గార్ల పోస్టాఫీస్ ఎదుట గ్రామీణ తపాలా ఉద్యోగులు మంగళవారం సమ్మెకు దిగారు. 20 ఏళ్లుగా చాలీచాలని వేతనంతో గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమను రెగ్యులర్ చేసి పే స్కేల్ ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె విరమించేది లేదని పేర్కొన్నారు. ఎస్‌కె జమీలా బేగం, అరుణ్‌కుమార్, చంద్రశేఖర్, ముజీబ్, సురేష్, ప్రవీణ్, నవీన్, బాలరాజు, మణికంఠ, ప్రకాష్, కవిత, మహేష్, వేణుగోపాల్, అనూష, రమేష్ ఉన్నారు.

సమ్మె చేపట్టిన గ్రామీణ తపాలా ఉద్యోగులు

కేసముద్రం : తమను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని గ్రామీణ తపాలా ఉద్యోగులు మంగళవారం మండల కేంద్రంలోని సబ్ పోస్టాఫీస్ ఎదుట సమ్మె నిర్వహించారు. దేశవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా పలువురు గ్రామీణ తపాలా ఉద్యోగులు మాట్లాడుతూ.. నాలుగు గంటల పని అని చెప్పి, నిబంధనలకు విరుద్ధంగా తమతో రోజంతా పని చేయించుకుంటూ శ్రమదోపిడి చేస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంత ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం స్పందించి వేతనాలు పెంచడంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు పింగిలి మల్లయ్య, బొబ్బల శ్రీనివాస్‌రెడ్డి, చందా గోపి, కోతి వెంకటరమణ, మాధవి, మల్లయ్య, శ్రీనివాసాచార్యులు, గంట రజిత, యూసఫ్, సుమన్, సుధాకర్, రవికాంత్, కమల్, జనార్దన్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్లను ఉపయోగించుకోవాలి

- మానుకోట మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి



అవగాహన కల్పిస్తున్న రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్ : మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్లను ప్రజలు ఉపయోగించుకోవాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి కోరారు. మంగళవారం పబ్లిక్ టాయిలెట్ల వద్ద శుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. తమ పనులపై మానుకోటకు వచ్చే ప్రజలు రోడ్లపై మూత్ర విసర్జన చేయకుండా పబ్లిక్ టాయిలెట్లు ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం పలు వార్డులలో పారిశుద్ధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. డ్రెయినేజీలలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని సిబ్బందితో శుభ్రం చేయించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, కౌన్సిలర్లు చిట్యాల జనార్దన్, బాలు నాయక్, డీఈ సీహెచ్ ఉపేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీహరి, పర్యావరణ అధికారి గుజ్జు క్రాంతి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య

గార్ల : మండలంలోని సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య స్థానిక అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం తొలిసారి గార్లకు వచ్చిన కోరం కనకయ్యకు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం గార్ల పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నెహ్రూసెంటర్‌లో ఎమ్మెల్యే మాట్లాడారు. ఇల్లెందు నియోజకవర్గం లోని అన్ని మండలాల కంటే గార్ల మండలంలో అత్యధిక మెజార్టీ ఇచ్చిన ఓటర్లకు ముందుగా కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో ప్రధాన సమస్యలపై దృష్టి సాధించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తొలుత స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గార్లలో క్రీడా మైదానం ఏర్పాటుకు ప్రభుత్వ భూమిని కేటాయించాలని తహసీల్దార్‌ను కోరారు. సమావేశం అనంతరం మత్స్యకారులు తమ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, సర్పంచ్ అజ్మీరా బన్సీలాల్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామరావు, గుండా వెంకట్‌రెడ్డి, తాళ్లపల్లి కృష్ణగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ శీలంశెట్టి ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీలు మాలోత్ వెంకట్‌లాల్, భట్టు నాగరాజు, మన్నేపల్లి సైదయ్య, మీరా పఠాన్, ఏఎంసీ మాజీ చైర్మన్ భూక్య నాగేశ్వరరావు, శంషాద్ బేగం, పి.కిషన్, అశోక్, వీరేందర్, రామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలి



మాట్లాడుతున్న అరుణ

మహబూబాబాద్ రూరల్ : విద్యార్థినులు చదువుల్లో రాణించేలా తల్లిదండ్రులు కృషి చేయాలని జిల్లా మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ నలమాస అరుణ అన్నారు. కంబాలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 'బేటీ బచావో.. బేటీ పడావో'పై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ.. బాలికలు అన్ని రంగాలలో ముందుండాలని సూచించారు. ప్రతీ ఒక్కరు ఆడపిల్లల సమానత్వం పట్ల ఆలోచన చేయాలని, వారు లేకుండా సమాజం లేదన్నారు. చిన్నతనం నుంచే తల్లిదండ్రులు ఆడపిల్లలపై ప్రేమ చూపించి వారికి గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, పిల్లల అక్రమ రవాణా, పోక్సో చట్టం గురించి తెలియజేయాలన్నారు. హెల్ప్ లైన్ నంబర్లు 1098, 181, డయల్-100 గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది సంధ్యారాణి, రాకేష్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేస్తా

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని కలిసిన స్థానికులు

తొర్రూరు : నియోజకవర్గ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన యశస్వినిరెడ్డిని స్థానికులు, పార్టీ నాయకులు మంగళవారం డివిజన్ కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నామని, అన్ని మండలాలను సమ దృష్టితో అభివృద్ధి చేస్తానన్నారు. నియోజకవర్గ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రథమ ప్రాధాన్యమిస్తానని ఆమె తెలిపారు. విద్యా, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, నాయకులు పెదగాని సోమయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు.

గాలొస్తే ఏజెన్సీలో అంధకారమే

- 33కేవీ విద్యుత్ లైన్ సమస్య వస్తే అంతే
- అదనపు లైన్ లేదా సబ్ స్టేషన్ నిర్మించాలని వేడుకోలు

కొత్తగూడ : ఏజెన్సీ మండలాలు కొత్తగూడ, గంగారంలో వానొచ్చినా.. గాలొచ్చినా విద్యుత్‌కు అంతరాయం కలిగి పూర్తి అంధకారం అలముకుంటుంది. కొత్తగూడ, సాధిరెడ్డిపల్లి, పెగడపల్లి, గంగారం 33/11 కేవీ సబ్ స్టేషన్‌కు వరంగల్ జిల్లా లక్నెపెల్లి 132/33కేవీ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. కొత్తగూడ వరకే సుమారు 27కి.మీ., సాధిరెడ్డిపల్లికి 32, గంగారం మండలానికి అయితే 50 కి.మీ దూరం 33 కేవీ లైన్ వెళ్తోంది. దీంతో వర్షం వచ్చినా, గాలి వచ్చినా లైన్ లో సమస్య ఎదురై రెండు మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచి పోతుంది. లైన్ మొత్తం అటవీ మార్గం గుండా ఉండడంతో సమస్యను గుర్తించడానికి సిబ్బందికి సవాల్‌గా మారుతోంది. దీంతో ఈప్రాంతంలో పని చేసేందుకు రావాలంటే సిబ్బంది వెనుకంజ వేస్తున్నారు. ఉన్న కాస్త సిబ్బంది ప్రైవేటు వ్యక్తుల సహకారంతో పనులు నెట్టుకొస్తున్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న సైతం వ్యవసాయానికి అధిక లోడు పెరిగినప్పుడు ఇదే పరిస్థితి నెలకొంటుందని స్థానికులు చెబుతున్నారు. 132/11 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటే పరిష్కారం ఏజెన్సీ మండలాలకు విద్యుత్ అంతరాయం లేకుండా నాణ్యమైన కరెంట్ సరఫరా చేయాలంటే గంగారం మండలకేంద్రం నుంచి మడగూడెం మధ్యలో 132/11 సబ్ స్టేషన్ నిర్మించాలని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అందుకు ఉన్నతాధికారుల అనుమతి కావాల్సి ఉంది. నూతనంగా పంచాయతీ రాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న ధనసరి సీతక్క ఆ దిశగా చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అప్పటి వరకు అదనంగా గూడూరు నుంచి కొత్తగూడ సబ్ స్టేషన్ వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు నుంచి గంగారం మండల కేంద్రం వరకు 20 కిలోమీటర్లు 33 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నివేదికలు పంపించాం..

గంగారం మండలంలోని మడగూడెం సమీపంలో 132/33 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి గతేడాది నివేదిక పంపిచాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదు. అనుమతి ఇస్తే ఏజెన్సీ ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయవచ్చు.

- నరేష్, ట్రాన్స్‌కో ఎస్‌ఈ, మహబూబాబాద్



విద్యుత్ లైన్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

భూ కబ్జాదారులపై చర్య తీసుకోవాలి

మరిపెడ రూరల్ : తాళ్లఊకల్ మైసమ్మ చెరువు శిఖం భూమిని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మరిపెడలోని నీటి పారుదల శాఖ అధికారులకు స్థానిక రైతులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాళ్లఊకల్ గ్రామానికి చెందిన సర్పంచ్ తనయుడు బొలగాని శ్రీనుతో పాటు మరికొందరు కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భాగంగా మైసమ్మ చెరువు శిఖం భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. ఈ విషయాన్ని మరిపెడ తహసీల్దార్‌కు, జిల్లా, మండల ఇరిగేషన్ అధికారులతో పాటు ప్రజావాణిలో విన్నవించామని పేర్కొన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినందుకు తమను సదరు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువు కబ్జా దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. బత్తుల శ్రీను, కారింగుల లింగస్వామి, తప్పెట్ల వెంకన్న, మట్టి మురళి, సురేందర్, సీమ సురేష్, బచ్చు నరేందర్, మురారి పాల్గొన్నారు.